


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

శుక్రవారం 6-6-2025

సంపుటి: 21 సంచిక: 63
పేజీలు: 8 వెల: రూ.1

## దారిదోపిడీకి పాల్పడుతున్న

# రాజస్థాన్ ముఠా అరెస్టు





- నగదు, మారణాయుధాలు స్వాధీనం
- నిందితులంతా ప్లాస్టిక్ బొమ్మలు అమ్మేవారే
- ఎస్పీ కెవీ మహేశ్వరరెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

జిల్లాలో టెక్కలి, నందిగాం, నరసన్నపేట, లావేరు తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో నేషనల్ హైవే పరిధిలో అర్ధరాత్రి వాహనదారులను కత్తులతో బెదిరించి దోపిడీకి ప్రయత్నిస్తున్న రాజస్థాన్‌కు చెందిన నలుగురు ముఠా సభ్యులను అరెస్టు చేయగా, ఒక్కరు పరారీలో ఉన్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నలుగురు నిందితులను మీడియా ముందుకు తీసుకువచ్చి వివరాలను వెల్లడించారు. అరెస్టయిన నలుగురు నిందితులు ఆదిత్య పవార్, బంగారం పవార్, సుధీర్ పవార్, శరత్ షిండేను టెక్కలి జగతిమెట్ట వద్ద టెక్కలి పోలీసులు అరెస్టు చేసినట్టు తెలిపారు. నిందితుల్లో సంజూ షిండేను అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. వీరి నుంచి రూ.1.12 లక్షలు నగదు, 2 ద్విచక్ర వాహనాలు, 8 సెల్‌ఫోన్లు, ఆరు కత్తులు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిందితుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు అన్నదమ్ములు, గ్రామానికే చెందిన వ్యక్తితో కలిసి అందరూ రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి మూడేళ్ల క్రితం వలస వచ్చి రణస్థలం మండలం కోస్టలో టెంట్‌లు వేసుకుని నివాసం ఉంటున్నారు. జీవనోపాధి నిమిత్తం ప్లాస్టిక్ బొమ్మలు తయారుచేసి చుట్టుపక్కల గ్రామాల్లో అమ్ముకుంటున్నట్లు తెలిపారు. వీరంతా చెడువ్యసనాలకు బానిసలై ప్లాస్టిక్ బొమ్మలు విక్రయించడం వల్ల వచ్చే ఆదాయం సరిపడక తగరపువలస నుంచి ఇచ్ఛాపురం వరకు జాతీయ రహదారిపై అర్ధరాత్రి ఆగివున్న లారీలు, ఇతర వాహనాలలో నిద్రిస్తున్న డ్రైవర్లను బెదిరించి వారివద్ద ఉన్న నగదు, మొబైల్ ఫోన్లను మూడేళ్ల నుంచి దోపిడి చేస్తున్నట్టు తెలిపారు. దోపిడీ

- మిగతా చివరి పేజీలో

# 'వెన్నుపోటు' నేర్పిన పాఠం




- యాక్టివ్ అయిన ధర్మాన, సీతారాం
- టెక్కలిలో విజయవంతం చేసిన తిలక్
- ఇచ్ఛాపురాన్ని మోనిటర్ చేసిన కృష్ణదాస్
- బలం పెంచుకోడానికి చింతాడకు వచ్చిన అవకాశం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ఏడాది పాలనలో హామీలు విస్మరించారంటూ వెన్నుపోటు పేరుతో జిల్లాలో వైకాపా చేపట్టిన కార్యక్రమం విజయవంతమైన అంశం పక్కన పెడితే జిల్లా వ్యాప్తంగా ఉన్న వైకాపా శ్రేణులకు, ప్రత్యర్థి టీడీపీకి ఓ సందేశాన్ని పంపగలిగింది. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గాల్లో వైకాపా చేపట్టిన ఇన్‌ఛార్జిల మార్పు, తత్ఫలితంగా తలెత్తిన అసంతృప్తి చల్లబడినట్లు ఈ కార్యక్రమం రుజువు చేసింది. ఆమదాలవలసలో కొత్త ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ వెనుక ఎవరున్నారు? ఇప్పటికీ కలసిరానివారిని ఎలా కలుపుకోవాలన్న అవగాహన ఈ కార్యక్రమం ద్వారానే ఏర్పడింది. ఇక్కడ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం తనను కాదన్నప్పుడు తన కుమారుడికైనా అసెంబ్లీ టిక్కెట్ ఇవ్వాలని కోరారు. అయినా చింతాడ రవి వైపే పార్టీ మొగ్గు చూపింది. సీతారాంను పార్లమెంట్ స్థానానికి పంపుతామన్న సంకేతాలు పంపింది. అప్పట్నుంచి సీతారాం అలకపాన్పుపైన ఉన్నారు. కానీ వెన్నుపోటు కార్యక్రమానికి టెక్కలి నియోజకవర్గంలో ఆయన హాజరవడం అచ్చెన్న ఇలాఖాలో కూడా వెన్నుపోటు కార్యక్రమం విజయవంతమైంది. స్వతహాగా ఇది కాళింగుల నియోజకవర్గం కావడంతో సీతారాం ఆ పార్టీలో ఆ సామాజికవర్గానికి పెద్దనేత కావడంతో సహజంగానే వైకాపా శ్రేణులంతా టెక్కలిలో విజయవంతం చేశారు. దీనికితోడు ఇన్‌ఛార్జి పేరాడ తిలక్ కూడా పక్కలో బల్లెం ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ పోటు లేకపోవడం వల్ల పార్టీ సింబల్‌తో ప్రతీ ఒక్కర్నీ కలవగలగుతున్నారు. అందుకే అచ్చెన్నాయుడు మంత్రిగా ఉన్నా ఆ నియోజకవర్గంలో వైకాపా శ్రేణులు రోడ్డెక్కడానికి వెనకడుగు వేయలేదు. ఇక గడిచిన ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిన దగ్గర్నుంచి కార్యక్రమాలకు దూరంగా ఉన్న ధర్మాన ప్రసాదరావు వెన్నుపోటు కార్యక్రమానికి రోడ్డెక్కకపోయినా కేడర్‌తో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఏడాదిగా స్తబ్ధుగా ఉండిపోయిన కొందరు కార్యకర్తల జాబితా తెప్పించుకొని నేరుగా ధర్మానే ఫోన్ చేసి కథంతొక్కాలని పిలుపునిచ్చారు. వైకాపా ఓటమిపాలైన తర్వాత ప్రధానంగా పార్టీ రెండు నిరసన కార్యక్రమాలు నిర్దేశించింది. కాకపోతే ఈ రెండింటికంటే వెన్నుపోటు విజయవంతమైంది. పాతపట్నం లాంటి గిరిజన ప్రాంతం ఎక్కువగా ఉన్న నియోజకవర్గంలో కూడా పెయిడ్ ఆర్టిస్టులు లేకుండా కార్యకర్తలే 500 మంది వరకు పాల్గొన్నారని టీడీపీ శ్రేణులు చెబుతుండటం విజయవంతమైందని చెప్పడానికి ఓ సాక్ష్యం. ఇచ్ఛాపురంలో పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌తో పాటు పరిశీలకుడు కుంభా రవిబాబు కూడా పాల్గొనడం వల్ల జనాల సంఖ్యతో ప్రమేయం లేకుండా అటువైపు మీడియా అటెన్షన్ పెరిగింది. మిగిలిన నియోజకవర్గాల కంటే ఇచ్ఛాపురంలో కూడా వైకాపా శ్రేణుల సంఖ్య తీసిపోలేదు. సిట్టింగ్ ప్రభుత్వానికి ఇంకా నాలుగేళ్లు కాల వ్యవధి ఉన్నందున సహజంగానే ప్రతిపక్షం నిర్వహించే నిరసనలకు ప్రజల మద్దతు కనిపించదు. దీనికి తోడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటిసారిగా కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, తల్లికి వందనం వంటి పథకాలు మొదలవుతున్నాయని తెలిసిన తర్వాత ప్రతిపక్షం తరఫున రోడ్డెక్కి వాటిని పోగొట్టుకోడానికి ఎవరూ ఇష్టపడరు. బుధవారం జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో పాల్గొన్నవారంతా వైకాపా శ్రేణులే. టెక్కలిలో కింజరాపు కుటుంబాలను ఢీకొట్టాలంటే మాస్ ఇమేజ్ ఉన్న దువ్వాడకు మాత్రమే సాధ్యమన్న భావనలో దాదాపు అన్ని పార్టీలూ ఉండేవి. కానీ పార్టీకి క్రౌడ్‌పుల్లర్ తానేనని తిలక్ ఈ కార్యక్రమం ద్వారా నిరూపించగలిగారు. సమీప కాలంలో అచ్చెన్నాయుడు, అంతకు ముందు ఎర్రన్నాయుడులు ఎమ్మెల్యేలుగా గెలవడం వల్ల ఇది వెలమ నియోజకవర్గమని భావిస్తున్నారు కానీ, ఇక్కడ కాళింగ ఓటర్లే ఎక్కువని నిరూపించడం కోసం సీతారామ్‌ను తీసుకొచ్చి తిలక్ వ్యూహాత్మక విజయం సాధించారు. తాను పార్టీ కార్యక్రమాలకు హాజరైనా, కాకపోయినా నియోజకవర్గం తన గ్రిప్‌లోనే ఉందని ధర్మాన నిరూపించుకోగలిగారు. పాతపట్నం టిక్కెట్ తమ కుటుంబం నుంచే వేరేవారు ఆశిస్తూ, కేడర్ తనతోనే ఉందని రెడ్డి శాంతి నిరూపించగలిగారు. ఇచ్ఛాపురంలో నాలుగు గ్రూపులున్న మాట వాస్తవమేనని పరోక్షంగా పార్టీ అంగీకరించినట్లయింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు, పరిశీలకుడు అక్కడకు వెళ్లకపోతే సిట్టింగ్ ఇన్‌ఛార్జికి వ్యతిరేకంగా కొందరు దీన్ని ఫ్లాప్ చేయడానికి ప్రయత్నిస్తారన్న సంకేతం పార్టీకి ఇచ్చినట్లయింది. ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశందో, బీజేపీదో తెలియకపోయినా ఇక్కడ గ్రూపులున్నా సక్సెస్ క్రెడిట్ మాత్రం పార్టీ మాజీ ఎమ్మెల్యే ఖాతాలోనే వేసింది. ఓవరాల్‌గా తెలుగుదేశం ఈ కార్యక్రమాన్ని లైట్‌గా తీసుకున్నా నిద్రాణంలో ఉన్న బ్యాటరీకి ఒక్కసారి ఛార్జింగ్ పెట్టినట్టు వైకాపా భావిస్తుంది.

## దక్షిణ కోస్తా రైల్వేజోన్ జిఎం

# నియామకం హర్షణీయం

- త్వరలో గెజిట్ నోటిఫికేషన్‌కు కసరత్తు
- ప్రధాని, రైల్వే మంత్రి, ముఖ్యమంత్రిలకు కృతజ్ఞతలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు మరో ముందడుగు పడింది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు శరవేగంగా సాగుతుంది. అందులో భాగంగా రైల్వేజోన్‌కు తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. జోన్ ఏర్పాట్లలో అత్యంత కీలకమైన చర్యగా భావిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. పరిపాలన అనుమతులు పనులు వేగవంతమయ్యేందుకు ఇది ఉపకరిస్తుందని, రైల్వేజోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. గత ఐదేళ్ల వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైల్వేజోన్ పనులు నిలిచిపోయాయని, జోన్‌కు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారని, దీనివల్ల ఉత్తరాంధ్రకు తీరని అన్యాయం జరిగిందని, ప్రస్తుతం రైల్వే జోన్ పనులు తిరిగి ప్రారంభమై వేగవంతంగా పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి అచ్చెన్న తెలిపారు. ఇప్పటికే 54 ఎకరాల భూమిని రైల్వేశాఖకు అప్పగించారని, జోన్ ఏర్పాటుతో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందడంతో పాటు రైల్వే ఆపరేషన్స్ సమర్థవంతంగా చేపట్టేందుకు వీలవుతుందన్నారు. విశాఖలోని ముడసర్లోవలో ఇప్పటికే స్థలాన్ని కేటాయించారని, రూ. 149 కోట్ల వ్యయంతో 9 అంతస్తుల రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుందని, ముఖ్యమంత్రి ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధానమంత్రి, రైల్వే శాఖ మంత్రితో దఫదఫాలుగా చర్చలు జరిపి రైల్వేజోన్ ఏర్పాటుకు వేగం పెంచినట్లు వివరించారు. గత 12 నెలల కాలంలో రూ.75వేల కోట్ల జాతీయ రహదారి ప్రాజెక్టులు, రూ.72వేల కోట్ల రైల్వే ప్రాజెక్టులు కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి తీసుకువచ్చామని, తద్వారా రాష్ట్ర అభివృద్ధి చురుగ్గా సాగుతోందని అన్నారు. విశాఖ రైల్వే జోన్‌పై గజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, దీనివలన ఉత్తరాంధ్ర జిల్లాలకు మరింత అభివృద్ధి సూచికలు రానున్నట్టు మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు.

# ప్రతీ సమస్యకు పరిష్కార మార్గం చూపిస్తాం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్
- ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే గొండు శంకర్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. నియోజకవర్గం నలుమూలల నుంచి వివిధ వర్గాల ప్రజలు, నియోజకవర్గంలోని గార, శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం నుంచి పెద్దఎత్తున ప్రజలు విశాఖ-ఎ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయానికి చేరుకొని వినతులను శుక్రవారం అందజేశారు. ప్రతి ఒక్కరి సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కార మార్గం చూపిస్తామని శంకర్ అన్నారు. కూటమి పాలనలో అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా గత ఐదేళ్లలో నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించక పోవడంతో పెద్ద ఎత్తున నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు అందుతున్నాయన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యం, విద్యుత్, డ్రైన్లు, సాగునీరు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి వినతులు అందుతున్నాయని, వాటిని పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కించే దిశగా చర్యలు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనలో సంక్షేమం, అభివృద్ధి సమాంతరంగా నిర్వహిస్తున్నామని, గత కొద్ది నెలల్లోనే ప్రజాప్రభుత్వంగా ప్రజలతో మన్ననలు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధికి, అభ్యున్నతికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నామని శంకర్ వివరించారు. ఇళ్లు కావాలని పెద్దఎత్తున వినతులు అందుతున్నాయని, రాష్ట్రమంత్రి దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఒక ప్రణాళిక రూపొందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఈస్ట్‌కోస్ట్ రైల్వే సలహా మండలి బోర్డు

# సభ్యునిగా డాక్టర్ బుడుమూరు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఇండియన్ రైల్వే మంత్రిత్వ శాఖ సూచనల మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే డివిజన్ సంప్రదింపుల సలహా మండలిను ఏర్పాటు చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ బోర్డులో సలహా మండలి సభ్యునిగా ప్రముఖ విద్యావేత్త, బీసీ నేత, ఐతం ఇంజనీరింగు కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బుడుమూరు రాజేష్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్తగా రైలును ప్రతిపాదించడం, ఉన్న రైలును కొత్తగా కొన్ని స్టేషన్లకు పొడిగించడం, వందే భారత్ లాంటి స్పీడ్ రైలును ప్రవేశపెట్టడం, ప్యాసింజర్లకు మెరుగైన సేవలు అందించడం, నూతనమైనా సాఫ్ట్‌వేర్ యాప్స్‌ను రూపొందించడం వంటి సలహాలు, సూచనలు ఈ నెల 24 మీటింగ్‌లో ఇవ్వనున్నట్లు బోర్డు సభ్యులు రాజేష్ తెలిపారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఉన్న శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని తెలిపారు. డాక్టర్ బుడుమూరు రాజేష్ ప్రస్తుతం జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యుడుగా, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవలు అందిస్తున్నారు. ఈయన ఎంపిక పట్ల తల్లిదండ్రులు, మిత్రులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు.

# చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

## - 15 బైక్‌లు, బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం -



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సారవకోట, జలుమూరు, నరసన్నపేట, ఎచ్చెర్ల, లావేరు, జేఆర్ పురం, శ్రీకాకుళం టూటౌన్, విజయనగరం జిల్లా డెంకాడ పోలీసు స్టేషన్ల పరిధిలో అనేక చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న సారవకోట మండలం బుడితికి చెందిన కొర్ల శివను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. శ్రీకాకుళం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రణస్థలం మండలం సుందరపాలెంకు చెందిన బస్వా సుధాకర్ రెడ్డి శ్రీకాకుళం నగరంలో ఏఎస్ఎన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిందితులను తీసుకువచ్చి కేసుల పూర్వపరాలను ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి వివరించారు. నిందితులను అదుపులోకి తీసుకొని 35 గ్రాములు బంగారం, 129 గ్రాములు వెండి ఆభరాలతో పాటు 15 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. సారవకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్ఐ అనీల్‌కుమార్ బుడితి జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీచేస్తుండగా కొర్ల శివ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించి పట్టుబడ్డాడని తెలిపారు. ఆయన నుంచి ప్లాస్టిక్ సంచిలో రెండు పాలిథిన్ కవర్లలో ఉన్న బంగారం, వెండి ఆభరణాలను గుర్తించి అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేయగా నేరాలకు పాల్పడినట్టు గుర్తించారన్నారు. సారవకోట

- మిగతా చివరి పేజీలో



• ఎడిటోరియల్

## భాషలకు తల్లి మూలద్రవిడం

ద్రావిడ భాషలన్నిటి మూల భాష " మూలద్రావిడం". అందులో మూడు ఉపకుటుంబాలు. దక్షిణ మూలద్రావిడ ఉపకుటుంబం నుంచి తమిళం, కన్నడ తదితర భాషలు పుట్టాయి. ఒక ఉపకుటుంబంలో ఆ రెండు సోదరభాషలు. అంతే తప్ప, తమిళం నుంచి కన్నడ పుట్టింది అనడం తప్పు. యథాలాపంగానో, సుహృద్భావం నుంచో కమల్‌హాసన్ అటువంటి వ్యాఖ్య చేసుండవచ్చు. కానీ, రెండు రాష్ట్రాల మధ్య జలవివాదాల దగ్గర నుంచి అనేక ఉద్రిక్తతలు ఉన్నప్పుడు కమల్ బాధ్యతగా మాట్లాడాల్సింది. ఆధునిక భాషాశాస్త్రం ప్రకారం మూల ద్రావిడ భాష (ప్రోటో ద్రవిడియన్ లాంగ్వేజ్) నుంచి పుట్టుకొచ్చాయి (పరిణమించాయి) దక్షిణాది భాషలు. వాటిలో తమిళ్, మలయాళం సోదరభాషలు కాగా, కన్నడ, తెలుగు సిస్టర్ లాంగ్వేజెస్. దక్షిణాది భాషలు అంటే నాలుగే కాదు. మూలద్రావిడ భాష నుంచి మొత్తం 27 భాషలు పుట్టుకొచ్చాయని భాషా శాస్త్రం పేర్కొంది. తుళు, కొళగు, కొడబు వంటి భాషలన్నీ మూల ద్రావిడ కుదురు నుంచి పుట్టినవే. బ్రాహుయీ అనే ఒక భాష మాట్లాడే వారు పాకిస్తాన్లో ఉంటున్నారు. అది కూడ మూలద్రావిడ భాష కుదురులోంచే వచ్చిందని తేల్చారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న భాషా శాస్త్రంపై 600 పేజీల పుస్తకం గతంలోనే రాశారు. ద్రావిడ భాషల పుట్టు పూర్వోత్తరాలపై పాపులర్ శైలిలో రాసిన ప్రామాణిక పుస్తకం అది. భద్రిరాజు కృష్ణమూర్తి, జీఎన్ రెడ్డి వంటి భాషా శాస్త్రజ్ఞులు ద్రావిడ భాషల విశిష్టతపై మంచి విశ్లేషణాత్మక రచనలు చేశారు. అవి ఏవీ సామాన్యులకు అందుబాటులో లేకపోవడం విషాదకరం. మానవ జాతి మొత్తంగా ఆఫ్రికన్ కుదురు నుంచే విస్తరించిందనే విషయం సరిగా అర్థమైతే మా భాష గొప్పది, మా భాష ప్రాచీనమైనది అనే అజ్ఞానపు భావనలు పేలిపోతాయి. కమల్‌హాసన్ దేశం గర్వించదగినంత మేటి నటుడు. పతితులార భ్రష్టులార,. అంటూ థగ్ లైఫ్ సినిమా ప్రచార సభలో ఆయన పాడిన శ్రీశ్రీ గేయం మనం వినొచ్చు. కానీ తమిళం నుండి కన్నడ పుట్టిందనడంలో కమల్‌తో పాటు పక్కనే ఉన్న శివరాజ్‌కుమార్ కూడా ఒకే భాషా కుదురు నుండి వచ్చిన వాళ్లమనే అర్థంలో భావోద్వేగ వ్యాఖ్య చేశారనే భావించాలి. కమల్ ఉద్దేశ పూర్వకంగా మా తమిళ్ గొప్పది అని మాట్లాడలేదు కానీ ఆయన నోటిలోంచి అంత మాట వచ్చాక దాని అర్థాలు రకరకాల రూపాలు తీసుకున్నాయి. అనుద్దేశంగా అయినా సరే బెంగళూరులో సినిమా ప్రచార సభలో కమల్ అలా అని ఉండకపోయి ఉండే బాగుండేది. పైగా వ్యాపారం కోసం తీసిన సినిమా విషయంలో అంత మొండి వైఖరితో 'నేను కర్నాటకలో థగ్ లైఫ్ సినిమా రిలీజ్ చేయను' అనేంత భీషణ ప్రతిజ్ఞలకు ఎందుకెళ్లారు అనేది ప్రశ్న. నేను తప్పు చేయలేదు అని కమల్ అన్నారు. నిజమే కావచ్చు. ఒక భాషా రాష్ట్రాన్ని ఆయన మాట మండించింది కదా. కమల్ హాసన్ తన సినిమా ప్రమోషన్ ఈవెంట్లో మాట్లాడిన మాటలకు కట్టుబడి ఉన్నాడు.. అతని అభిప్రాయం అతనిది!.. ఈ విషయంలో అతనిది అహంకారంగా భావించక్కర్లేదు. 6వేల సంవత్సరాలకు పూర్వం లిపి లేదు.. భాషా స్వరూపం లేదు.. ప్రాచీన కాలంలో ఈ దేశంలో ఉన్నవి ద్రావిడ భాషలే. లిపిలో తమిళం, మలయాళం పోలికలు ఉన్నాయి. తెలుగు, కన్నడ లిపికి అనుబంధం ఉంది. కమల్ హాసన్ బహుళ భాషల్లో నటించినందువల్ల అతను బహు భాషావేత్త కాగలిగాడు. మాతృభాష అయిన తమిళం మాత్రమే కాకుండా తెలుగు, మలయాళం, కన్నడ కూడా స్వచ్ఛంగా, ధారాళంగా మాట్లాడగలడు. తాను నటించే ఇతర భాషా సినిమాలల్లోని తన పాత్రలకి తానే స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంటాడు. అది అతను ఇతర భాషల పట్ల చూపించే గౌరవానికి తార్కాణం. అతని భాషా ఆసక్తి, నిబద్ధత చూస్తుంటే అతని పట్ల గౌరవం ఏర్పడుతుంది. తెలుగులో మాట్లాడటమే కాదు ఆయన తెలుగుని చదవగలడు కూడా! శ్రీశ్రీ కవిత్వాన్ని తమిళ వేదికల మీద చదివి వినిపించాడాయన. అలాంటి కమల్ ఇతర భాషల పట్ల చులకనగా వ్యవహరిస్తారనడం సరికాదేమో? రాజకీయ నాయకులు ప్రతిదీ తమ రాజకీయ లబ్ధికి ఉపయోగించుకున్నట్లే ఈ వ్యాఖ్యకీ వక్రార్థాలు తీశారు. దాంతో కర్నాటక ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కమల్ 'థగ్ లైఫ్' కర్నాటకలో విడుదల కాకూడదని హైకోర్ట్‌కి వెళ్లింది. "మీరేమైనా భాషావేత్తా లేక చరిత్రకారులా? క్షమాపణ చెబితే ఇంత దూరం వచ్చేది కాదుగా?" అంటూ హైకోర్ట్ వ్యాఖ్యానించింది. ఓ భాష కోసం మాట్లాడాలంటే భాషావేత్త చరిత్రకారుడే అయివుండాలా? లేదూ తమిళం కంటే ముందే కన్నడంలో శాసనాలు ఉన్నాయని ఎవరైనా చెప్పే ప్రయత్నం చేయొచ్చు కదా. తమిళానికి మాత్రమే ప్రాచీన భాష హోదా ఇచ్చినప్పుడు తెలుగు, కన్నడీయులు ఎందుకు మిన్నకున్నారు?

# ఆటో డ్రైవరే కానీ..

## ఛార్టెడ్ అకౌంటెంట్లను మించి సంపాదిస్తున్నాడు




**సం**పాదించాలనే తపన ఉండాలే గానీ.. ఐడియాలు మస్త్ అంటున్నాడు ఈ ముంబై ఆటోడ్రైవర్. పైగా ఆటో నడపం ఆపేశాడు. పోనీ, ఏదైనా ఓలానో, ఊబర్ వంటి సంస్థలు తన ఆటోను హైర్ చేసుకుని నడిపిస్తున్నదీ కాదు. కానీ, ఆ ఆటోడ్రైవర్ సంపాదన మాత్రం ఇప్పుడు నెలకు రూ.5 లక్షల నుంచి రూ.8 లక్షల మధ్య ఉంటోందట. ఇప్పుడీ స్టోరీ లింక్డ్ ఇన్‌లో తెగ వైరలై మిగిలిన సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్స్‌లోనూ చక్కర్లు కొడుతోంది. వాస్తవంగా ఇప్పుడీ ఆటోడ్రైవర్ సంపాదిస్తున్న డబ్బు చాలామంది చార్టెడ్ అకౌంటెంట్స్, ఐటీ నిపుణులు సంపాదిస్తున్నదానికంటే కూడా ఎక్కువ ఉండటమే ఇతగాడి స్టోరీ వైరల్ కావడానికి కారణం. సదరు ఆటోడ్రైవర్ కథను లెన్స్‌కార్ట్ వ్యవస్థాపకుడైన రాహూల్ రూపానీ తన లింక్డ్ ఇన్ అకౌంట్‌లో షేర్ చేశారు. ఇంతకీ ఆటోడ్రైవర్ చేస్తున్నదేంటని అంత డబ్బంటారా..?

**ముం**బైలోని యూఎస్ కాన్సులేట్‌కు నిత్యం వందలు, వేలమంది వీసా అపాయింట్మెంట్ పర్పస్‌లో వస్తూ, పోతూ ఉంటారు. భద్రతా ప్రోటోకాల్ దృష్ట్యా కాన్సులేట్ ప్రాంగణంలోకి వచ్చే సందర్శకులు బ్యాగ్స్ గానీ, ఎలక్ట్రానిక్ వస్తువులనుగానీ తీసుకెళ్లడాన్ని అనుమతించరు. ఈ సమస్యను గుర్తించిన ఆటోడ్రైవర్ ఇక తనకు ఆటో నడిపే అవసరం లేదనీ అంతకుమించి గుర్తించాడు. కానీ, ఆటో మాత్రం తన వెంటే ఉంటుంది. కాన్సులేట్ బయట తన ఆటో పెట్టుకుని వచ్చి, పోయేవారి బ్యాగ్స్‌ను, ఇతర సామాన్లను లోపలికి తీసుకెళ్లడం నిషేధం ఉన్న నేపథ్యంలో తన ఆటోలో పెట్టి వెళ్లమంటాడు. మళ్లీ వాళ్లు తమ పని ముగించుకుని వచ్చేటప్పుడు వారి సామాన్లను భద్రంగా అప్పజెప్పుతాడు. ఇలా ఒక్కో కస్టమర్ దగ్గర అవి భద్రంగా వారు వచ్చేవరకూ పెట్టుకుని తిరిగి భద్రంగా అప్పజెప్పినందుకు వెయ్యి రూపాయలు ఛార్జ్ చేస్తాడు. ఇలా యూఎస్ కాన్సులేట్‌ను అడ్డాగా చేసుకుని తన ఆటో నడపకుండానే.. సామాన్లు భద్రపర్చే స్థలంగా మార్చేసి రోజుకు ఒక 20 నుంచి 30 సామాన్లను భద్రపర్చి, 20 నుంచి 30 వేల రూపాయలు సంపాదిస్తున్నాడు. అంటే నెలకు యావరేజ్‌గా 5 నుంచి 8 లక్షల డబ్బును జస్ట్ ఆటోను ఉన్నచోటే పెట్టుకుని ఎలాంటి డీజిల్, పెట్రోల్ ఖర్చుల్లేకుండా.. ఎక్కడికీ తిరిగి అలసిసొలసి పోకుండా ఈ ఆటోడ్రైవర్ సంపాదిస్తున్న తీరు యూఎస్ కాన్సులేట్‌కు వచ్చే కార్పోరేట్ శక్తులను కూడా ఆశ్చర్యపరుస్తోంది. అందుకే ఈ కథను రాహూల్ రూపానీ షేర్ చేశారు.

మరి ఆటో స్టాండ్‌లో ఆటో పెట్టుకున్నప్పుడు ఎవరైనా కస్టమర్స్ వస్తే వెళ్లాల్సి వస్తుంది కదా అంటే.. అది పెద్ద గిరాకీ అయితే సదరు డ్రైవర్ దాన్నీ మిస్ చేసుకోడు. అందుకోసం, దగ్గరే ఉన్న ఓ పోలీస్ ఆఫీసర్‌తో పార్టనర్‌షిప్ మెయింటెయిన్ చేస్తున్నాడు. సదరు పోలీస్ ఆఫీసర్‌కు లాకర్ స్పేస్ ఉండటంతో.. తాను ఎటైనా వెళ్లితే ఆ సామాన్లన్నింటినీ ఆ ఆఫీసర్ లాకర్‌లో పెట్టి వెళ్లి మళ్లీ వచ్చేస్తాడు. దాంతో తాను ఆటోరైడింగ్‌కు వెళ్లినా ఎలాంటి సమస్య రాకుండా ముందే ప్లాన్ చేసుకున్నాడు.

నమ్మకాన్ని చూరగొని, అంతకుమించిన భద్రతను కల్పిస్తున్నాడు గనుకే ప్రీమియం ఛార్జెస్ వసూలు చేస్తున్నాడు సదరు డ్రైవర్. కాబట్టి ఇప్పుడు ముంబై యూఎస్ కాన్సులేట్ వద్ద సదరు డ్రైవర్ చేస్తున్న బిజినెస్ ఎందరికో ఓ మాస్టర్ క్లాస్‌గా అభివర్ణిస్తూ రాహూల్ రూపానీ ఈ స్టోరీని షేర్ చేశారు.

ఎలాంటి మాస్టర్ డిగ్రీలక్కర్లేకుండా, ఎలాంటి యాప్స్, టెక్నాలజీ వంటివేవీ అవసరమే లేకుండా, ఎలాంటి పెట్టుబడి పెట్టకుండా, ఎలాంటి అనవసరమైన హడావిడి లేకుండా.. సదరు డ్రైవర్ చేస్తున్న బిజినెస్‌ను ఇదీ అసలైన వ్యాపారమంటే అంటూ కొనియాడాడు రాహూల్ రూపానీ. ఈ కథకు అదే స్థాయిలో ఆన్ లైన్‌లో స్పందన కనిపిస్తుండగా, ఆవిష్కరణలు సూట్ బూట్లతోనే రావు, అవి యూనిఫామ్ వేసుకున్నవాళ్ల నుంచీ పుట్టుకురావచ్చు. రాయబార కార్యాలయాల బయట ఆవిష్కరించబడవచ్చంటూ భిన్నమైన స్పందనలతో ఆ ముంబై డ్రైవర్ బిజినెస్ అప్లాజ్ అందుకుంటోంది.

రమణ కొంటికర్ల




# లైఫ్ లెస్!

నాయకుడు.. భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత గొప్ప చిత్రాల్లో ఒకటి. అలాంటి ఆల్ టైం క్లాసిక్ అందించిన కమల్ హాసన్- మణిరత్నం జోడీ.. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కలిసి చేసిన సినిమా.. థగ్ లైఫ్. భారీ అంచనాల మధ్య ఈ రోజే ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్ర విశేషాలేంటో చూద్దాం పదండి.

**కథ:**

రంగరాయ శక్తిరాజు (కమల్ హాసన్) ఢిల్లీలో చిన్న రౌడీగా మొదలుపెట్టి పెద్ద గ్యాంగ్ స్టర్ గా ఎదుగుతాడు. తన వల్ల ప్రాణాలు కోల్పోయిన ఓ వ్యక్తి కొడుకు అయిన అమర్ (శింబు)ను చేరదీసి తన కొడుకులా పెంచుతాడు. తన వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించే క్రమంలో శక్తిరాజుకు పెద్ద ఎత్తున శత్రువులూ తయారవుతారు. వాళ్లందరినీ తట్టుకుని శక్తిరాజు తన సామ్రాజ్యాన్ని నిలబెట్టుకుంటాడు. ఐతే ఒక హత్య కేసులో శక్తిరాజు జైలుకు వెళ్లాల్సి రావడంతో తాత్కాలికంగా అమర్ వ్యాపార బాధ్యతలు చేపడతాడు. శక్తిరాజు బయటికి వచ్చేసరికి అమర్ శక్తిమంతుడు అవుతాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య దూరం మొదలవుతుంది. ఈ దూరం ఎక్కడిదాకా వెళ్లింది? ఇద్దరి మధ్య పోరాటం తప్పని పరిస్థితుల్లో ఎవరు పైచేయి సాధించారు? అన్నది మిగతా కథ.

**కథనం-విశ్లేషణ:**

ఎప్పుడో 38 ఏళ్ల ముందు వచ్చిన సినిమా.. నాయకుడు. ఇప్పుడు చూసినా ఆ కథతో.. పాత్రలతో.. ఎమోషన్లతో కనెక్ట్ అవుతాం. టైంలెస్ అనిపించే క్లాసిక్ అది. అలాంటి అద్భుతాన్ని ఆవిష్కరించిన మణిరత్నం – కమల్ హాసన్ జోడీ.. మళ్లీ ఇన్నేళ్ల పాటు కలిసి సినిమా చేయలేదు. ఇంత కాలానికి కలిశారంటే 'నాయకన్' లాంటి కల్ట్ మూవీ అందించకపోయినా.. తమ కాంబినేషన్ కు ఉన్న పేరును చెడగొట్టని సినిమా అయినా అందిస్తారని ఆశిస్తాం. కానీ 'థగ్ లైఫ్' సినిమా చూశాక.. మణిరత్నం–కమల్ మళ్లీ కలవకపోయి ఉంటే బాగుండని అనుకోని అభిమాని ఉండడు అంటే అతిశయోక్తి కాదు. 'నాయకన్'ను మించిన సినిమా అని 'థగ్ లైఫ్' గురించి కమల్ ఏ నమ్మకంతో అన్నారో కానీ.. అందులో పదో వంతు స్థాయిలో కూడా నిలవలేని అత్యంత సాధారణమైన చిత్రమిది. ఇండియన్ స్క్రీన్ మీద వందల సార్లు చూసి గ్యాంగ్ స్టర్ డ్రామానే అటు ఇటు తిప్పి వడ్డించేసిన మణిరత్నం.. తన కెరీర్లో తొలిసారిగా 'ఔట్ డేట్' అయిపోయిన భావన కలిగించాడు.

మణిరత్నం నిఖార్సయిన హిట్టు కొట్టి చాలా ఏళ్లయింది. 'చెలియా' సినిమా డిజాస్టర్ అయితే.. ఆ తర్వాత వచ్చిన నవాబ్.. పొన్నియన్ సెల్వన్ కూడా అంచనాలను అందుకోలేకపోయాయి. ఐతే మణిరత్నం నుంచి ఫెయిల్యూర్లు వచ్చినా ఆయన 'ఔట్ డేటెడ్' అయిన ఫీలింగ్ మాత్రం ఇప్పటిదాకా ఏ సినిమా ఇవ్వలేదు. 'చెలియా'.. 'కడలి' లాంటి సినిమాలు కూడా ఆ భావన కలిగించలేదు. కానీ నాలుగు దశాబ్దాల సుదీర్ఘ కెరీర్లో 'థగ్ లైఫ్' మాత్రం ఆయన వెనుకబడిపోయారని బలంగా అనిపించేలా చేస్తుంది. అసలు ఈ కథలో ఏం కొత్తదనం ఉందని ఆయన ఏరి కోరి ఇన్నేళ్ల తర్వాత కమల్ తో జట్టు కట్టారన్నది అర్థం కాని విషయం. కమల్ ఐడియా నుంచి డెవలప్ చేసిన ఈ కథలో ఎక్కడా రవ్వంత కూడా కొత్తదనం కనిపించదు. స్క్రీన్ ప్లే పరంగా అయినా ఏదైనా కొత్తగా ట్రై చేశారా అంటే అదీ లేదు. కనీస ఆసక్తి రేకెత్తించని.. రొటీన్ సన్నివేశాలతో సినిమాను పరమ బోరింగ్ గా మార్చారు. ప్రథమార్థంలో పాత్రల పరిచయం.. కథకు ఒక పునాది పడే వరకు 'థగ్ లైఫ్' పర్వా లేదనిపిస్తుంది. కానీ పాత్రల తీరుతెన్నులు చూశాక ఈ కథ ఎలా ముందుకు సాగుతుందని సులువుగా అర్థమైపోతుంది. గ్యాంగ్ స్టర్ అయిన హీరో చుట్టూ ఉండే పాత్రలను కనీసం నర్మగర్భంగా చూపించినా.. తర్వాత వాళ్లు నమ్మక ద్రోహానికి పాల్పడితే ప్రేక్షకులు ఆశ్చర్య పోవడానికి అవకాశముండేది. కానీ ఆరంభం నుంచే ఆ పాత్రలేంటన్నది ఓపెన్ అయిపోవడంతో.. తర్వాత వాళ్లేం చేస్తారనే విషయంలో ముందే ఒక అంచనా వచ్చేస్తుంది. నమ్మక ద్రోహం జరిగాక ఏముంటుంది? హీరో తిరిగొచ్చి ప్రతీకారం తీర్చుకోవడం తప్ప? ద్వితీయార్థమంతా అదే జరుగుతుంది.

మామూలుగా మణిరత్నం సినిమాల్లో ఒక సన్నివేశం ఎలా మొదలవుతుందో.. ఎలా నడుస్తుందో.. ఎలా ముగుస్తుందో అంచనా వేయడం కష్టం. డైలాగులను కూడా ముందు ఊహించలేం. అక్కడే మణిరత్నం తన ప్రత్యేకతను చూపిస్తాడు. కానీ 'థగ్ లైఫ్'లో మాత్రం ఆయన ఒక సగటు ప్రేక్షకుల స్థాయికి పడిపోవడం విడ్డూరం. ఎప్పుడు ఏం జరుగుతుంది.. ఎవరేం మాట్లాడుకుంటారు.. అన్నది మనం ఎలా ఊహిస్తామో అలా రొటీన్ గా జరిగిపోతుంది. ముగింపు వరకు ఎక్కడా ఆశ్చర్యాలుండవు. ట్విస్టులూ ఉండవు. వయసు మీద పడ్డ వ్యక్తి.. కత్తి పోటుకు గురై.. తుపాకీ గుండు తగిలాక.. వందల అడుగుల ఎత్తు నుంచి బండ రాళ్లు.. చెట్ల మీది నుంచి కింద పడ్డ వ్యక్తి కొన్ని నెలల తర్వాత ఎలా బతికి వస్తాడో అర్థం కాదు. వచ్చాక చేసే విన్యాసాల గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. అసలే కథలో కొత్తదనం లేదు. పైగా ఎక్కడా ఎమోషన్లూ వర్కవుట్ కాలేదు. దీంతో 'థగ్ లైఫ్' ఏ దశలోనూ ప్రేక్షకులను ఎంగేజ్ చేయలేకపోయింది.

గ్యాంగ్ స్టర్ డ్రామాల్లో సాధారణంగా ఏం జరుగుతుం ది? సామాన్యుడిగా ప్రయాణం మొదలుపెట్టిన వ్యక్తి నేర సామ్రాజ్యంలో ఎవ్వరూ అందుకోలేని స్థాయికి చేరుకుంటాడు. చుట్టూ పెద్ద బలగం తయారవుతుంది. అలాగే శత్రువుల సంఖ్యా పెరుగుతుంది. కుట్రలకు తెర లేస్తుంది. ప్రతి ఒక్కరినీ అనుమానించే పరిస్థితి వస్తుంది. నమ్మిన వాళ్లే ద్రోహం చేస్తారు. తర్వాత హీరో ఆ ద్రోహం చేసిన వాళ్ల పనిపడతాడు. ఎన్ని సినిమాల్లో చూడలేదు ఈ లైన్? మణిరత్నం కూడా ఇప్పుడు ఇదే స్టయిల్లోనే సినిమా లాగించేశాడు. ఐతే ప్రతిసారీ కొత్త కథలతోనే ప్రయాణం చేయడం సాధ్యం కాదు. పాత కథలనే కొత్తగా చెప్పి మెప్పించొచ్చు. మణిరత్నం ఇలాంటి కథను ఎంచుకున్నాడంటే.. దానికి తనదైన ట్రీట్మెంట్ జోడించి ఏదో మ్యాజిక్ చేస్తాడనే అనుకుంటాం. 'థగ్ లైఫ్' మొదట్లో అలాంటి ఆశలే రేకెత్తిస్తుంది. తన దర్శకత్వంలో వచ్చిన 'నవాబ్' తరహాలోనే ఒక ఇంట్రెస్టింగ్ సెటప్ ను ఆయన రెడీ చేసుకున్న ఆయన.. ఆ బేస్ మీద ఏదో అద్భుతం చేస్తాడని చూస్తాం. కానీ ఈ కథ ఒక మలుపు తిరిగే వరకు ఓ మోస్తరుగా అనిపించి.. ఆ తర్వాత మాత్రం సగటు రివెంజ్ డ్రామాలా మారి ప్రేక్షకులను తీవ్ర అసహనానికి గురి చేస్తుంది. ప్రధాన పాత్రల్లో ఏ కొత్తదనం లేకపోవడం.. ఎమోషన్లు ఏమాత్రం పండకపోవడం.. దీనికి తోడు ద్వితీయార్థం అంతా పరమ రొటీన్ గా సాగడంతో 'థగ్ లైఫ్'ను పూర్తిగా చూడడం కూడా కష్టమైపోతుంది.

**సాంకేతిక వర్గం:**

ఏఆర్ రెహమాన్ సంగీతం సినిమాకు తగ్గట్లే సాగింది. కొన్నేళ్ల నుంచి తన స్థాయికి తగ్గ సంగీతం అందించలేకపోతున్న రెహమాన్.. ఈ చిత్రంలోనూ నిరాశపరిచాడు. పిండి కొద్దీ రొట్టె అన్నట్లు మొక్కుబడిగా సంగీతం అందించాడనిపిస్తుంది. థీమ్ సాంగ్ ఒకటి బాగున్నా.. మిగతావి సోసోగా సాగాయి. నేపథ్య సంగీతంలోనూ అంత స్పెషాలిటీ ఏమీ లేదు. సినిమాకు అతి పెద్ద ఆకర్షణ అంటే మాత్రం.. రవి.కె.చంద్రన్ ఛాయాగ్రహణమే. విజువల్స్ కంటికి ఇంపుగా అనిపిస్తాయి. ప్రొడక్షన్ వాల్యూస్ చాలా బాగున్నాయి. ప్రతి సన్నివేశంలో క్వాలిటీ కనిపిస్తుంది. కానీ కమల్–మణిరత్నం కలిసి రాసిన కథలోనే ఏ విశేషం లేకపోయింది. రొటీన్ కథకు.. అంతే రొటీన్ ట్రీట్మెంట్ తో మణిరత్నం ఆశ్చర్యపరిచాడు సినిమా మెప్పించినా మెప్పించకపోయినా.. కొత్తగా ప్రయత్నిస్తాడని పేరున్న మణిరత్నం.. ఈ చిత్రంలో మాత్రం రొటీన్ దారిలో సాగిపోవడం అభిమానులను తీవ్ర నిరాశకు గురి చేసేదే.

**నటీనటులు:**

కమల్ హాసన్ వయసుకు తగ్గ పాత్రలో తన మార్కు నటనతో మెప్పించే ప్రయత్నం చేశారు. ఎంతో శ్రద్ధగా తెలుగు డబ్బింగ్ కూడా చెప్పారు. కానీ ఆయన చేసిన ఐకానిక్ క్యారెక్టర్ల ముందు శక్తిరాజు పాత్ర నిలవజాలదు. కొన్ని సన్నివేశాల్లో కమల్ అద్భుతంగా నటించినా.. కొన్ని సీన్లలో మాత్రం నటనలో నాటకీయత ఎక్కువైనట్లు అనిపిస్తుంది. ద్వితీయార్థంలో కమల్ క్యారెక్టర్ మాత్రమే కాదు.. గెటప్ కూడా తేడా కొట్టేసింది. శింబు పాత్ర గురించి టీం ఒక రేంజిలో చెప్పుకుంది కానీ.. అందులో ఏ విశేషం లేదు. పరమ రొటీన్ పాత్ర అది. శింబు గెటప్ బాగున్నా.. పాత్ర తేలిపోవడంతో తన నటన ఎలివేట్ కాలేదు. అభిరామి తక్కువ సన్నివేశాల్లోనే తన ప్రత్యేకతను చాటుకుంది. త్రిష పాత్ర సినిమాకు అనవసరం అనిపిస్తుంది. ఆమె చాలా ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ.. కథకు తన పాత్ర ఏ వాల్యూ యాడ్ చేయలేకపోయింది. టాలెంటెడ్ యాక్టర్ జోజు జార్జ్ వృథా అయిపోయాడు. నాజర్.. తనికెళ్ల భరణి కూడా అంతే. అశోక్ సెల్వన్ పాత్ర.. నటన గురించి చెప్పడానికి ఏమీ లేదు. ఐశ్వర్యా లక్ష్మి ఆఖర్లో కొన్ని నిమిషాలే కనిపించినా.. చక్కగా నటించింది. ఆమె పాత్ర ముందు నుంచే ఉంటే బాగుండేదనిపిస్తుంది.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...

## ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

❖ విజేతలకు బహుమతులు ప్రధానం



(సత్యంన్యూస్, లావేరు)

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా లావేరు శాఖా గ్రంథాలయం లో శుక్రవారం గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఏప్రిల్ 28వ తేదీ నుంచి నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. గ్రంథాలయానికి విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను పంపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టైలరింగ్ శిక్షణ ప్రారంభం



(సత్యంన్యూస్, టెక్కలి)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ (టైలరింగ్) కార్యక్రమం టెక్కలి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు శుక్రవారం టెక్కలి అంబేద్కర్ భవనంలో ప్రారంభించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ జిల్లా ఇన్‌ఛార్జి చంద్రశేఖర్, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, బసవల అప్పలస్వామి, మెండ దమయంతి, బెహరా కాళీ, కృష్ణవేణి, రెయ్యి ప్రీతీష్ చంద్ర, దల్లి ప్రసాద్‌రెడ్డి, పేర మురళి, టీఎస్ఎన్ రవణ, ధవల శ్రీను, ప్రఫుల్ల పరిడ, సోదిముడి కిరణ్, మెట్ట చంద్రరావు, బొడ్డేపల్లి లచ్చు, కోరాడ రాంప్రసాద్, గండి సూర్యనారాయణ, నర్తు కృష్ణారావు, కొనారి శ్రీను, యాళ్ల మల్లేష్, పొట్నూరు వినాయకరావు, గేదెల చిన్నయ్య, పొట్నూరు శంకర్, బొడ్డు మహేష్, బొల్ల యోగి, గండి చంద్రరావు, దాసరి జీవనరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాంధ్రపై అవగాహన ర్యాలీ

(సత్యంన్యూస్, ఆమదాలవలస)

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ ఆధ్వర్యంలో యోగా నిర్వహణపై అవగాహన కల్పిస్తూ మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ముందుగా సిబ్బందితో కలిసి యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రతిరోజు యోగా చేయడం వల్ల శరీర ధృడత్వం పెరగడంతో పాటు ఆరోగ్యం కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.




### పనిగంటల పెంపు నిర్ణయం
## ఉపసంహరించుకోవాలి

(సత్యంన్యూస్, టెక్కలి)

కార్మికుల పనిగంటలను నాలుగు గంటలు అదనంగా పెంచుతూ ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సిటు నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ టెక్కలి చిన్నబజారు వీధి కార్మికుల సమావేశంలో మాట్లాడారు. పనిగంటలు పెంచడం దుర్మార్గ చర్యని, కార్మికుల వేతన సవరణ, సంక్షేమం చూడని పాలకులు పనిగంటలు పెంచడమంటే ఎవరి లాభాల కోసం కార్మికులను బలి పశువులు చేస్తారని ప్రశ్నించారు. తక్షణం పని గంటల పెంపుదల నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.




## 108లో గర్భిణీ సుఖప్రసవం



(సత్యంన్యూస్, పలాస)

మందస మండలం టిక్కరిపొడ గ్రామానికి చెందిన పుష్ప పాయకో శుక్రవారం వేకువజామున పురిటి నొప్పులతో బాధ పడుతూ 108కి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మందస 108 సిబ్బంది హుటహుటిన చేరుకొని హాస్పిటల్‌కి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువ కావడంతో ఈఎంటీ గోపాల కృష్ణ ప్రసవం చేయగా, మగబిడ్డకి జన్మనిచ్చింది. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇద్దర్నీ హరిపురం ప్రభుత్వ హాస్పిటల్‌లో చేర్చారు. ఈ కార్యక్రమంలో పైలట్ ఎం.రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు 108 సిబ్బందిని అభినందించారు.

## యోగాపై అవగాహన పెంపొందించుకోవాలి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం రూరల్)

యోగాపై ప్రతిఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని సానివాడ సర్పంచ్ రుప్ప లక్ష్మీరమణమూర్తి పిలుపునిచ్చారు. శ్రీకాకుళం రూరల్ మండలం సానివాడ గ్రామంలో యోగ శిక్షణ తరగతులను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందని, విద్యార్థులు దేహధారుఢ్యంతో పాటు ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందించుకోవచ్చని అన్నారు. ప్రతిరోజు యోగా చేయడం ద్వారా వైద్యఖర్చులు తగ్గుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, వీఆర్వో సిహెచ్ మురళీకృష్ణ, సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు, యువత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

## యోగాతో ప్రశాంతత

✸ సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్ రెడ్డి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యోగాతో ప్రశాంతత వస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి తెలిపారు. 80 అడుగుల రహదారిలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన ఏకాగ్రత, నిశ్చలతలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయం సిబ్బంది, ఆయుష్ నుంచి చంద్రశేఖర్, ఇతర సిబ్బంది, యోగా శిక్షకులు మురళీకృష్ణ, నగర ప్రజలు పాల్గొన్నారు.



## పైడిభీమవరంలో ఎన్ఈఆర్ గ్రీవెన్స్

(సత్యంన్యూస్, రణస్థలం)

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌ను పైడిభీమవరం గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసారు. ప్రజల నుంచి పలు సమస్యలపై ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు వినతులు స్వీకరించారు. అర్జీలను ఎంపీడీవో, తహసీల్దార్‌లకు పంపి పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేసారు. కార్యక్రమంలో సర్పంచ్ సింక భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాధం, గొర్లె లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.



## గ్రంథాలయాలు జ్ఞానసరస్వతి నిలయాలు

❖ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

❖ నగర పంచాయతీ కమిషనర్ రత్నంరాజ్



(సత్యంన్యూస్, పాలకొండ)

గ్రంథాలయాలు జ్ఞాన సరస్వతి నిలయాలని, పిల్లల్లో పఠనా సామర్థ్యం అభివృద్ధి చెంది భవిష్యత్తులో ఉన్నతమైన వ్యక్తులుగా తయారుకావడానికి పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ కె.రత్నంరాజ్ సూచించారు. పాలకొండ శాఖా గ్రంథాలయంలో ఏప్రిల్ 28 నుంచి 40 రోజుల పాటు జరిగిన వేసవి శిబిరం ముగింపు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రంథాలయ పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులు, యోగా గురువు కె.జనార్ధనరావు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని, మంచి పాఠకులు, రచయితలు, ఆలోచనపరులుగా ఎదుగుతారని అన్నారు. గ్రంథాలయ ఇన్‌ఛార్జి బబ్బురు గణేష్‌బాబు పిల్లలకు జరిపిన వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు కమిషనర్ ద్వారా అందజేశారు. వ్యాస రచన పోటీలో పి.శ్రీపాద, కె.ధరణి, వి.భరత్‌కుమార్, డ్రాయింగ్ పోటీలో ఎస్.నిఖిల్, వి.కార్తీక్, బి.రోహిత్, మట్టిబొమ్మలు పోటీలో వి.లోహిత్, ఉదయ్, భార్గవ్, ఖోఖో ఆటలపోటీలో ఉదయ్, గణేష్, భార్గవ్ గెలుపొందారు. చిత్రలేఖనం ఉపాధ్యాయుడు గొర్లె మురళీ, సహాయకుడు ఈశ్వర్, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

## గోమాతలను వధకు తరలిస్తే సహించేది లేదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

గోవులను వధించడానికి తరలిస్తే అక్రమంగా రాత్రి సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేదిలేదని బజరంగ్ దళ్ శ్రీకాకుళం జిల్లా సంయోజక్ కొయ్యాన కిరణ్ హెచ్చరించారు. గోవులను తరలించే వాహనాలను బైపాస్ జంక్షన్ వద్ద పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ అక్రమ గోరవాణా, గోవధ ఆంధ్రప్రదేశ్ గోహత్య నిషేధం, జంతు సంరక్షణ చట్టం 1977, అలాగే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 ప్రకారం గోవధ నిషేధమని, జంతువులను హింసించకూడదని తెలిపారు. గోవులను, ఎద్దులను వధకు తీసుకెళ్లాలనుకుంటే వెటర్నరీ డాక్టర్ దగ్గర అది వట్టిపోయిన ఆవు అని, వ్యవసాయానికి కూడా పనికి రాని ఎద్దు అని సర్టిఫికెట్ ఉండాలని, దూడలను ఎట్టి పరిస్థితుల్లోనూ వధించే హక్కు లేదన్నారు. ఎంతటి వ్యక్తులు అయినా పై చట్టంలోని నియమ నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఇరికించి పశువులను తీసుకువెళ్తే వాహనాలను అడ్డుకునే బజరంగ్‌దళ్ కార్యకర్తలపై బెదిరింపులు, దాడులు చేయాలని చూసినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ప్రాంత సంయోజక్ రావాడ రాజశేఖర్, గార ప్రఖండ సంయోజక్ వంజల శ్రీనివాసరావు, గార ప్రఖండ సురక్షా ప్రముఖ్ కస్పా అమర్‌నాధ్, గార ప్రఖండ సాప్తాయక్ మిలన్ ప్రముఖ్ లబ్బ రాజు, నగర సురక్షా ప్రముఖ్ కరగాన నాగరాజు, బగ్గు తరుణ్, బోర గోపి, బజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ విద్యారంగానికి తూట్లు పొడుస్తున్నారు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఏడాది కావస్తున్న విద్యారంగంలో పేరుకుపోయిన సమస్యలను ఇంతవరకు పరిష్కారం చేయలేదని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి.రామ్మోహన్ విమర్శించారు. నగరంలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు విద్యార్థులకు అనేక హామీలు ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక వాటిని విస్మరిస్తున్నారని విమర్శించారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన యువగళం పాదయాత్రలో గత ప్రభుత్వం లోపాలను ఎత్తిచూపుతూ జీవో నెంబర్ 117 రద్దుచేసి పాఠశాల విద్య వ్యవస్థను సమూలంగా మారుస్తానని, ప్రాథమిక పాఠశాలలు మూసివేత ఆపుతానని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఉన్న పాఠశాలలను మూసివేసే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. పీజీ విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్, తల్లికి వందనం, హాస్టల్ మెస్ ఛార్జీల పెంపుదల తదితర హామీలన్నీ అధికారంలోకి వచ్చాక మర్చిపోయారన్నారు. మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతుంటే వాటికోసం ఎక్కడ మాట్లాడకుండా కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు విధంగా ముందస్తు అడ్మిషన్లు, బ్రిడ్జి కోర్సులు ప్రారంభించుకోవడానికి ప్రభుత్వమే అధికారికంగా పర్మిషన్ ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు చేస్తున్న దోపిడీకి వ్యతిరేకంగా ప్రభుత్వం స్పందించాలని, అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో విద్యార్థులందరినీ ఏకంచేసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

JMR Veg. & Non-Veg Restaurant Flavours
కార్ పార్కింగ్ సదుపాయం కలదు

## శిశుసేవలకు నూతన వేదిక శిశుగృహం

❖ కేంద్రమంత్రి చేతుల మీదుగా సదుపాయాలు ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం నగరంలోని శిశుగృహం, బాలసదనంలో ఏర్పాటు చేసిన క్రేడిల్ బేబీ రిసెప్షన్ సెంటర్, సిక్‌రూమ్, రెండు పోషణ వాటికలు, మరమ్మతుల అనంతరం పూర్తయిన సుందరీకరణ పనులను కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండకర్, మహిళా, శిశు అభివృద్ధి శాఖ పీడీ బి.శాంతిశ్రీ, డీసీపీవో రమణ, మోడల్ ఆఫీసర్ పుణ్యవతి, శిశు గృహ మేనేజర్ నరేష్, ఐసిపీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, దాసు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు చిల్డ్రన్ హోమ్‌లో పిల్లలతో ముచ్చటించి, వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. వారితో సన్నిహితంగా మమేకమై వారి అవసరాలు తెలుసుకున్నారు. శిశుగృహ అభివృద్ధికి కృషిచేసిన జిల్లా కలెక్టర్, శాఖాధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు.

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సివింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నీచర్..
అన్ని రకాల సివింగ్ మిషన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
Near Surya Mahal Theatre
Women's College Road,
Srikakulam - 532 001

SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పనిచేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను
CONTACT
9440001447, 8341163666

## దారిదోపిడీకి పాల్పడుతున్న రాజస్థాన్ ముఠా అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన మొబైల్ ఫోన్లను గుర్తు తెలియని వ్యక్తులకు తక్కువ ధరకు విక్రయిస్తూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తూ వచ్చారని వివరించారు. ఆరు నెలలుగా రాత్రివేళల్లో కత్తులతో ఒంటరిగా ఉన్నవారి దగ్గరకు వెళ్లి బెదిరించి డబ్బులు, మొబైల్ ఫోన్లు దోపిడీ చేసి, అడ్డుకున్నవారిని కొట్టి, కత్తులు, రాళ్లతో దాడిచేసి గాయపరిచి పారిపోతున్నట్లుగా విచారణలో తేలిందని తెలిపారు. నిద్రిస్తున్న వ్యక్తుల నుంచి దోపిడీ చేస్తుండడంతో మూడేళ్లలో వీరి మీద ఎటువంటి కేసులు నమోదు కాలేదన్నారు. అయితే ఆరునెలలుగా నిందితులు ఐదుగురు నిద్రిస్తున్న వారిని లేపి, కత్తులతో బెదిరించి, దోపిడీ చెయ్యడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఇంటి ముందు పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగతనం చేస్తూ, పలు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఆమదాలవలసకు చెందిన బొడ్డేపల్లి సతీష్‌కుమార్, స్నేహితుడు బెనర్జీ మోటార్ సైకిల్‌పై నందిగాంలోని కణితూరులో వివాహ వేడుకకు హాజరై తిరిగి వస్తుండగా టెక్కలి మండలం విక్రంపురం బస్టాప్ వద్ద వర్షం కారణంగా నిలిచారన్నారు. ఆ సమయంలో నిందితులు నలుగురు కత్తులు చూపించి, డబ్బులు, మొబైల్ ఫోన్లు ఇవ్వమని తీవ్రంగా గాయపరిచి, గొంతు మీద కత్తి పెట్టి బెదిరించి రూ.6 వేలు నగదు, 2 మొబైల్ ఫోన్స్ దోపిడీ చేసినట్లు తెలిపారు. వీరిచ్చిన ఫిర్యాదుతో టెక్కలి పోలీసులు కేసు నమోదు చేశారని తెలిపారు. కేసును అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేసి నిందితులను అదుపులోకి తీసుకోవడంలో ప్రతిభ కనబరిచిన టెక్కలి సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ ఎస్ఎస్ చంద్రమౌళి, సీసీఎస్ కె.మధుసూధనరావు, హెచ్‌సీ శ్యాం, కానిస్టేబుల్ బి.లోకనాథం, ఎన్.సంతోష్ కుమార్, డి.ఉమామహేశ్వరరావు, ఎస్.ప్రసాదరావు, ఎస్.భాస్కరరావును ఎస్పీ అభినందించారు. సమావేశంలో ఆయా డివిజన్లకు చెందిన డీఎస్పీలు, సీఐలు తదితరులు పాల్గొన్నారు.

## చోరీ కేసులో ఇద్దరు అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలో బంగారం, వెండి ఆభరణాలు, ఒక బైక్, జలుమూరు పరిధిలో బంగారం, వెండి ఆభరణాలు, ఎచ్చెర్ల పరిధిలో 5 మోటార్ సైకిళ్లు, జేఆర్ పురం పరిధిలో రెండు, శ్రీకాకుళం టూ టౌన్ పరిధిలో రెండు, లావేరు పరిధిలో ఒకటి, నరసన్నపేట పరిధిలో ఒకటి, డెంకాడ పరిధిలో ఒకటి మోటార్‌సైకిల్‌ను తస్కరించినట్టు తెలిపారు. శ్రీకాకుళంలో రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ మౌళీ సిబ్బందితో పాత్రనివలస ఫ్లైఓవర్ అండర్‌పాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బస్వా సుధాకర్‌రెడ్డి పట్టుబడ్డాడని తెలిపారు. శ్రీకాకుళం రెండవ పట్టణ పరిధిలో విశాఖపట్నంలో మొత్తం మూడు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్టు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఎస్పీ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చాకచక్యంగా వ్యవహరించి కేసు ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకొని ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన నరసన్నపేట సీఐ ఎం.శ్రీనివాస్‌రావు, సారవకోట ఎస్సై అనిల్‌కుమార్, రూరల్ ఎస్ఐ ఎస్ఎస్ చంద్రమౌళీ, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమావేశంలో డివిజన్ అధికారులు, సీఐలు పాల్గొన్నారు.




# టిజిటి జీకే ప్రశ్నలు చాలా టఫ్ గురూ..!



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షల్లో శుక్రవారం జరిగిన టి.జి.టి. పరీక్షలో జీకే చాలా టఫ్‌గా ఉందని అభ్యర్థులు చెబుతున్నారు. జనరల్ నాలెడ్జ్‌లో వచ్చిన కొన్ని ప్రశ్నలు సివిల్స్ తరహాలో ఉన్నాయని ఉపాధ్యాయ అభ్యర్థులు వ్యాఖ్యానించడం కొసమెరుపు. సాధారణంగా జనరల్ నాలెడ్జ్ విభాగంలో ఎటువంటి ప్రశ్నలడుగుతారో అందరికీ తెలుసు. అయితే ఆ కేటగిరీలో వచ్చిన ఒక ప్రశ్నను ప్రస్తావిస్తే పేపరు ఎంత కఠినంగా ఉందో అర్థమవుతుంది. సుప్రీంకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి ఎప్పుడు రిటైరవుతున్నారనే ప్రశ్న ఉంది. దీని కింద నాలుగు తేదీలు ఇచ్చారు. వాస్తవానికి జీకేలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరని గాని, పదవీ విరమణ వయసు ఎంతని గాని జీకే పుస్తకాల్లో ప్రస్తావిస్తారు. దాన్నే మనోళ్లు బట్టీపడతారు. రోజువారీ న్యూస్‌పేపర్ చదివితే తప్ప ఎప్పుడు రిటైరవుతారన్న విషయం తెలియదు. సాధారణంగా సివిల్స్‌లోనే ఇటువంటి ప్రశ్నలు వస్తాయి. ఇప్పుడు ఉపాధ్యాయులకు కూడా రోజువారీ సమాజం మీద అవగాహన ఉండాలనే ఉద్దేశంతోనే ఇటువంటి ప్రశ్నలివ్వడం కొసమెరుపు. శుక్రవారం జరిగిన టీజీటీ పరీక్షలో 40 మార్కులు సంబంధిత సబ్జెక్టు, 10 మార్కులకు జనరల్ నాలెడ్జ్, 5 మార్కులు సైకాలజీ, మరో 5 మార్కులకు విద్యాదృక్పథం, 20 మార్కులు మెథడాలజీ కలిపి 80 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నలు కూడా కఠినంగానే ఉన్నాయి. వాస్తవానికి ఇటువంటి మార్పు అవసరమే. మార్కెట్‌లో దొరికే డీఎస్సీ ప్రిపరేషన్ గైడ్‌లు, కోచింగ్ సెంటర్లలో సబ్జెక్టు, మెథడాలజీ కోసం చెప్పే రొటీన్ ప్రశ్నలు కాకుండా ఉపాధ్యాయుడికి సమాజం పట్ల అవగాహన ఉండాలన్న కోణంలో ఇచ్చిన ప్రశ్నలు బాగున్నాయని కొందరంటుంటే.. డీఎస్సీ ఎప్పుడు నిర్వహిస్తారో తెలియక ఇటువంటి ప్రశ్నలు వేశారని మరికొందరు అంటున్నారు. దీన్ని పక్కన పెడితే జిల్లాలో ఉపాధ్యాయ అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లో జిల్లా యంత్రాంగం మంచి ఏర్పాట్లే చేసింది. ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్న కళాశాలలకే సెంటర్లు కేటాయించడం వల్ల అభ్యర్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

## ప్రకృతి పరిరక్షణ కోసం వృక్షాలు నాటండి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతీయ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నగరంలోని హడ్కోకాలనీ పార్క్ వద్ద గురువారం సాయంత్రం ఆ సంస్థ ప్రతినిధులు 40 మొక్కలను నాటారు. బిహెచ్ఆర్సీ జాతీయ చైర్‌పర్సన్ సాహు సూచనల మేరకు వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రభ నేతృత్వంలో 200కు పైగా మొక్కలను నాటారు. బిహెచ్‌ఆర్సీ ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల అధ్యక్షులు కె.వేణుగోపాల్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పి.ఎన్.మణిశర్మ, జిల్లా అధ్యక్షురాలు జ్యోతిర్మయి, వర్కింగ్ ప్రెసిడెంట్ సౌజన్య పట్నాయక్, గ్రంథాలయ అధికారి ఉగ్రసేన్, అనిత పర్యవేక్షణలో పార్క్ పరిసరాల్లో మొక్కలు నాటారు.

## రైల్వేజోన్ ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఉత్తరాంధ్ర చిరకాల కోరిక దక్షిణ కోస్తా రైల్వేజోన్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేసిందని, అందులో భాగంగా జిఎంగా సందీప్ మాధురిని నియమించారని ఎమ్మెల్యే గొండు శంకర్ పేర్కొన్నారు. ఈమేరకు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నియామకంతో పనులు పరిపాలన వ్యవస్థ వేగవంతమవుతుందన్నారు. రైల్వే జోన్ ఏర్పాటుకు దేశ ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు విశేష కృషి చేశారని, కూటమి ప్రభుత్వంలో పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వం తప్పిదం వల్ల ఉత్తరాంధ్రకు తీవ్రనష్టం కలిగిందని, రైల్వేజోన్‌కి కావలసిన 54ఎకరాలు భూమిని కూడా సేకరించుకోలేక పోయారన్నారు. రైల్వే జోన్ ఏర్పడితే పెద్దఎత్తున మౌలిక సదుపాయాలు, అభివృద్ధి ఏకకాలంలో జరుగుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే, రైల్వే జోన్ కోసం అనేకసార్లు రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రం దృష్టికి తీసుకువచ్చారని, అందువల్లే సాధ్యమైందన్నారు. రూ.149 కోట్లతో ప్రధాన కార్యాలయం నిర్మాణం జరుగుతుందని, 12 నెలల కాలంలో రూ.75వేల కోట్ల నేషనల్ హైవే పనులు, రూ.72వేల కోట్లతో రైల్వేప్రాజెక్ట్ పనులు కేంద్రం నుంచి రాష్ట్రానికి తీసుకువచ్చారన్నారు. ఇది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశేష కృషి అని తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌కు త్వరలో గెజిట్ నోటిఫికేషన్ కూడా విడుదలవుతుందన్నారు

# మన ఐఏఎస్‌లలో నకిలీలు?!

- దేశంలో 22 మంది సివిల్స్ అధికారులపై ఇటువంటి ఆరోపణలు
- 15 మంది వరకు ఉన్నారని ఇప్పటికే కేంద్రం నిర్ధారణ
- సమగ్ర విచారణకు ఆయా రాష్ట్రాలకు ఆదేశాలు
- ఆర్టీఐ కార్యకర్త ఫిర్యాదుతో కదులుతున్న డొంక

దేశంలో అత్యున్నత అధికార వ్యవస్థగా సివిల్ సర్వీసెస్‌ను చెప్పుకోవచ్చు. రాజ్యాంగ మూలస్తంభాల్లో ఒకటైన ఎగ్జిక్యూటివ్ (కార్యనిర్వాహక వ్యవస్థ)ను నడిపించేది సివిల్ సర్వీస్ అధికారులే. ప్రజాప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను, పార్లమెంటు, అసెంబ్లీ వంటి చట్టసభలు రూపొందించే చట్టాలను అమలుచేస్తూ ప్రజల్లోకి తీసుకెళ్లాల్సింది సివిల్ సర్వీసెస్ అధికారులే. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రభుత్వాలు-ప్రజల మధ్య వారధులు వీరే. ఇంతటి కీలకమైన ఉన్నతాధికారులను ఎంపిక చేసే విధానం కూడా అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా, కఠినంగా ఉండాల్సిందే. యూనియన్ పబ్లిక్ సర్వీస్ (యూపీఎస్సీ) నిర్వహించే సివిల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్‌కు ఇంతకాలం కచ్చితత్వానికి మారుపేరు అన్న ఖ్యాతి ఉండేది. కానీ ఇప్పుడు దాని ఎంపిక ప్రక్రియపై అపనమ్మకాలు పెరుగుతున్నాయి. అనుమానాల మేఘాలు కమ్ముకుంటున్నాయి. సివిల్ సర్వీసెస్ ద్వారా నియమితులయ్యే ఐఏఎస్, ఐపీఎస్, తదితర



అత్యున్నత సర్వీసులకు చెందినవారు నకిలీ రిజర్వేషన్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని ఆరోపణలు రావడం దీనికి నిదర్శనం. దీనిపై కేంద్ర, రాష్ట్రాల స్థాయిలో విచారణ కూడా జరుగుతుండటంతో ఐఏఎస్, ఐపీఎస్ వ్యవస్థపై విశ్వసనీయత దెబ్బతింటోంది. దేశంలో ఏకంగా 22 మంది సివిల్ సర్వీస్ అధికారులు నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారని ఒక ఆర్టీఐ కార్యకర్త ఆరోపించడం కేంద్ర, రాష్ట్రాలను కలవరపాటుకు గురి చేసింది.




### తీగ లాగితే..

రాజస్థాన్‌కు చెందిన ఓ యువకుడు 2022లో సివిల్ సర్వీస్ ర్యాంకు సాధించి ఐఏఎస్‌కు ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్ క్యాడర్ ఎంపిక చేసుకుని అక్కడ ఉద్యోగంలో చేరాడు. అయితే ఆయన తన ఎంపిక సమయంలో ఫోర్జరీ లేదా నకిలీ ఈడబ్ల్యూఎస్ (ఎకనమికల్లీ వీకర్ సెక్షన్) సర్టిఫికెట్ సమర్పించి అక్రమంగా ఉద్యోగం సంపాదించారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై కేంద్ర హోంశాఖకు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్(డీవోపీటీ)తో పాటు రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. దేశవ్యాప్తంగా సుమారు 15 మంది సివిల్ సర్వీస్ అధికారులు ఇదే తరహాలో ఈడబ్ల్యూఎస్, పీడబ్ల్యూబీడీ, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వారమంటూ నకిలీ సర్టిఫికెట్లు పుట్టించి దొడ్డిదోవలో ఉద్యోగాలు కొట్టేశారని కేంద్ర హోంశాఖ జరిపిన ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. వీరిలో ఏకంగా 11 మంది ఐఏఎస్ అధికారులు ఉండగా ఇద్దరు ఐపీఎస్, ఒక ఐఎఫ్ఎస్, ఒక ఐఆర్ఎస్ అధికారి ఉన్నారని నిర్ధారించారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, హర్యానా, ఒడిశా, బీహార్, మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్ర హోంశాఖ, విదేశాంగ శాఖల్లో ప్రస్తుతం పని చేస్తున్నారు. దీనివల్ల సివిల్ సర్వీస్ ఎంపిక ప్రక్రియలో వ్యవస్థాగత లోపాలు ఉన్నట్లు తేటతెల్లమవుతోంది.

### 22 మంది ఉన్నట్లు ఫిర్యాదు

ఒక విజిల్ బ్లోయర్ ఫిర్యాదుతో నకిలీ సివిల్ సర్వెంట్ల బాగోతం వెలుగులోకి వచ్చింది. పుణేకు చెందిన విజిల్ బ్లోయర్, సమాచార హక్కు(ఆర్టీఐ) కార్యకర్త విజయ్ కుంభార్ 2024లో ఈ తేనె తుట్టెను కదిపారు. వాస్తవానికి ఇలా నకిలీ సర్టిఫికెట్లతో అక్రమంగా ఉద్యోగాలు పొందిన సివిల్ సర్వీసు అధికారులు దేశంలో 22 మంది ఉన్నారని ఆయన కేంద్ర హోంశాఖకు ఫిర్యాదు చేశారు. దానిపై ప్రాథమికంగా విచారణ జరిపిన అధికారులు 15 మంది నకిలీ అధికారులు ఉన్నట్లు నిర్ధారించడం విశేషం. మహారాష్ట్రకు చెందిన పూజా ఖేద్కర్ అక్రమంగా ఐఏఎస్ సాధించిన విషయాన్ని కూడా విజయ్ కుంభారే తొలుత వెలుగులోకి తెచ్చారు. ఈ ఉదంతం అప్పట్లో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.

### విచారణకు ఆదేశాలు

ఈ ఆరోపణలపై సమగ్ర విచారణకు కేంద్ర హోంశాఖకు చెందిన డీవోపీటీ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశించినట్లు తెలిసింది. 2022 బ్యాచ్ ఐఏఎస్ అధికారి సమర్పించిన ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ప్రామాణికతను ధ్రువీకరించాలని గత నెల ఐదో తేదీన కేంద్రం డీవోపీటీ ఉన్నతాధికారి అన్షుమన్ మిశ్రా పేరుతో రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు ఉత్తర్వులు వెళ్లాయి. అదే విధంగా ఆరోపణలు వచ్చిన మిగతా రాష్ట్రాలకు కూడా ఇలాంటి ఆదేశాలే పంపినట్లు తెలిసింది. తాజా ఆరోపణల నేపథ్యంలో దేశ అత్యున్నత కార్యనిర్వాహక వ్యవస్థకు అధికారులను అందజేసే సివిల్ సర్వీసెస్ నియామక ప్రక్రియలో వైఫల్యాలు, లోపాలను సమీక్షించి సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని మాజీ, సీనియర్ సివిల్ సర్వీస్ అధికారులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో మొత్తం వ్యవస్థే ప్రజల్లో విశ్వాసం కోల్పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.

డి.వి.రమణ, సత్యం ప్రత్యేక ప్రతినిధి



యోగాంధ్ర 2025 మండల స్థాయి పోటీలను బూర్జ మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ తిరుపతిరావు ప్రారంభించారు. దొంకల పర్త గ్రామానికి చెందిన రీస్మిత, దీపక్ సూర్య ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి జిల్లా స్థాయి పోటీలకు అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో యోగి గురువు బెజ్జిపురం తోటన్నాయుడు, సెక్రటరీ మురళీమోహన్‌లు పాల్గొన్నారు. - సత్యంన్యూస్, బూర్జ



ప్రత్యక్షదైవం ఆరోగ్య ప్రదాత ఉషా పద్మిని, ఛాయ సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి వారికి గురువారం వైభవంగా కళ్యాణం నిర్వహించారు. ఉదయం 8.00 గంటలకి జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకొని స్వామి వారికి కళ్యాణం నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ అర్చకులు సందీప్ శర్మ, ఫణీంద్రశర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.
- సత్యంన్యూస్, శ్రీకాకుళం

## ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణా శిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని హడ్కోకాలనీ గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. 42 రోజుల పాటు విద్యార్థిని విద్యార్థులకు కళలు, క్రీడలతో పాటు ఎన్నెన్నో అంశాలపై గ్రంథాలయ అధికారి ఉగ్రసేన్ నేతృత్వంలో శిక్షణ ఇచ్చారు. ముగింపు వేడుకలు సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు కార్యక్రమం ముఖ్య అతిథిగా ఏపీడబ్ల్యుజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొంక్యాన వేణుగోపాల్, గ్రంథాలయాలయాధికారి చంద్రశేఖర్, ప్రముఖ రచయిత ఉమాకవి, రవి మాస్టార్ చేతులమీదుగా బహుమతి ప్రధానం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థిని విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శలను ఆహుతులను అలరించాయి.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.